# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-01-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **'స్టార్టప్ ఇండియా'ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు.**

2. **సంజీవని ప్రాజెక్టును ఈ ఏడాది చివరి నాటికి అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

2. **దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో సహకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.**

4. **ఈరోజు కనుమ పండుగను తెలుగు ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు.**

==========================

'స్టార్టప్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ రోజు నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన అంకుర సంస్థల ప్రతినిధులతో ప్రధాన మంత్రి ముచ్చటించనున్నారు. అనంతరం సభికులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

---------------------------

పౌరుల డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించే సంజీవని ప్రాజెక్టును ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రమంతా అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. నారావారిపల్లెలోని సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. సంక్రాంతి రోజున పెద్దలను తలచుకోవడం, ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతి అని చెప్పారు. 2047లోగా స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు ఉంటేనే సంపదకు విలువ ఉంటుందని పేర్కొంటూ..

వాయిస్…43 సెకన్లు

---------------------------

దేశ భద్రతకు సంబంధించిన అంశాల్లో సహకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాదు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో

ముఖ్యమంత్రి అధ్యక్షతన పౌర సైనిక సంబందాల సమావేశం నిన్న జరిగింది. ఈ సందర్భంగా ఆర్మీ, తెలంగాణ ప్రభుత్వం మధ్య భూ సంబంధ, ఇతర పరిపాలనా సమస్యల పరిష్కారంపై ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సదరన్ కమాండ్ సెంటర్ ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌కు మార్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. వికారాబాద్‌లో.. లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడార్ స్టేషన్‌కు 3 వేల ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు.

-----------------------------

నాలుగు రోజుల సంక్రాంతి పండుగలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ప్రజలు ఈరోజు కనుమ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. జీవన స్రవంతిలో ప్రకృతి, పశువులు మనకు అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతలు తెలియజేయడమే కనుమ పండుగ నిర్వహణలోనీ ముఖ్యోద్దేశం. పొలం పనులు పూర్తయి .... పండించిన పంటలు ఇళ్లకు వచ్చిన సందర్భంగా ఏడాది పొడవునా ఈ మహా క్రతువులో సహాయం అందించిన పశువులను రైతులు పూజిస్తారు. అంతే కాకుండా.... ఇళ్లకు ధాన్యపు కంకులను కట్టి పక్షులను కూడా ఆదరించడం సాంప్రదాయంగా వస్తోంది. కాగా .... ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రేపు ముక్కనుమ పండుగను నిర్వహిస్తారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు కనుమ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. రైతుల జీవితాలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొన్న పశు సంపదను పూజించే పవిత్ర కర్తవ్యాన్ని కనుమ పండుగ మనకు బోధిస్తుందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆ విలువలను కాపాడుకుంటూ రైతులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కనుమ పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

-----------------------------

తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు స్వర్ణ చంద్రగిరి ప్రణాళికలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. స్వర్ణ కుప్పం, నారావారి పల్లె తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా ముఖ్యమంత్రి ఈ ప్రణాళికలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నారావారి పల్లెలోని నివాసంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఉన్నతాధికారులతో నిన్న నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు ఆయన దిశానిర్ధేశం చేశారు. చంద్రగిరి మండలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఈ అభివృద్ధి ప్రణాళికల్ని అమలు చేయనున్నారు. గత ఏడాది సంక్రాంతికి కందులవారి పల్లి, చిన్న రామాపురం, ఎ రంగంపేట గ్రామాలను కలిపి స్వర్ణ నారావారిపల్లి కార్యక్రమానికి ఎంపిక చేశామన్నారు. స్వర్ణ నారావారి పల్లె ప్రాజెక్టుతో ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలు వచ్చాయని చెప్పారు.

-----------------------------

భూమి, నీరు, గాలిని పరిరక్షించుకుని వ్యవసాయాన్ని సుస్థిరం చేసుకోవడంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా

తణుకు మండలం దువ్వకు చెందిన రైతు సత్యనారాయణ ఆకాశవాణితో మాట్లాడుతూ సహజ వ్యవసాయం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. రసాయనాలతో పండించిన పంటలతో రోగాల భారిన పడుతున్నామని పేర్కంటూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కుటుంబ సభ్యులతో కలిసి నారావారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో నిన్న పాల్గొన్నారు. తొలుత టీటీడీ వేద పండితులు ముఖ్యమంత్రి, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. గ్రామదేవత దొడ్డి గంగమ్మ, కులదేవత నాగాలమ్మ దేవాలయాలను కుటుంబ సమేతంగా సందర్శించిన ఆయన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ పెద్దలకు నివాళులు అర్పించారు.

---------------------------

మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణాన్ని సుందరీకరించాలని, ఈ నెల 18న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రులు దనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ లతో కలిసి మేడారంలో ఆయన నిన్న పర్యటించారు. సమ్మక్క సారలమ్మ మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు మంత్రులు ఆర్టీసీ బస్టాండ్, జంపన్న వాగు, స్తూపం రోడ్లను సందర్శించారు. సమ్మక్క సారలమ్మ గద్దెలు పునరుద్ధరణ పనులను పరిశీలించారు. వన దేవతలను దర్శించుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలలో రానున్న 2 రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు నిష్క్రమించేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్ర అధికారి బి. శేఖర్ పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమల్లో పొడి వాతావరణం నెలకొనడంతోపాటు, దట్టమైన పొగ మంచు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశము ఉందని పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతల్లో వచ్చే 5 రోజుల పాటు గణనీయమైన మార్పులు ఉండవని తెలిపారు.

మరోవైపు తెలంగాణలో రానున్న ఐదు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడిచింది. రానున్న రెండు రోజుల పాటు అదిలాబాద్, కొమరం భీమ్, నిర్మల్ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ లోపు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ వరకు పంపవచ్చు.

=====================